సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 24 । నవంబర్ । 2024



దాడులు అరికట్టండి

ఆలయంలో శివలింగం చోరీ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ నేత సుభాష్ కోరారు. 8లో▸



విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యం

విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



చిన్నబోయిన వైకల్యం

వైకల్యం శరీరానికే కానీ మేదస్సుకు కాదని నిరూపించాడు ఓ దివ్యాంగుడు. డాక్టరేట్ అందుకుని స్ఫూరిగా నిలిచాడు. 8లో▸

న్యూస్‌రీల్

మహాద్భుతం.. కన్హా శాంతివనం



శాంతివనం ఆవరణలో మొక్క నాటుతున్న గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్

నందిగామ: 'ఓ వైపు ఆధ్యాత్మిక ధ్యాన మందిరం.. మరో వైపు ఆకుపచ్చని ఆహ్లాదకరమైన వాతావరణం.. ఇంకో వైపు ప్రకృతి సహజసిద్ధ వ్యవసాయం.. ఇలా కన్హా శాంతివనం మహాద్భుతంగా ఉంది' అని గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ అన్నారు. నందిగామ మండలంలోని కన్హాను శనివారం ఆయన సందర్శించారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ గ్లోబల్ గైడ్ కమ్లేశ్ డి.పటేల్‌తో కలిసి ధ్యానం చేసి, అనంతరం శాంతివనాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ సహజసిద్ధంగా చేస్తున్న వ్యవసాయం బాగుందని కితాబిచ్చారు. అనంతరం మొక్కలు నాటారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



చింతపట్లలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సెర్ప్ డీపీఎం నర్సింహ

యాచారం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని సెర్ప్ డీపీఎం నర్సింహ అన్నారు. మండల పరిధిలోని నందివనపర్తి, యాచారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలులో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ధాన్యంలో తేమ శాతం అధికంగా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. డ్వాక్రా సంఘాల సమావేశాలు ప్రతీ నెల కచ్చితంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళల డబ్బులు దుర్వినియోగమైతే బాధ్యులైన సీసీలు, వీబీకేలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల్లో పురోగతి ఉండాలి

చేవెళ్ల: పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల్లో వేగవంతమైన పురోగతి ఉండాలని డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఏసీపీ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏసీపీ పరిధిలోని పోలీస్ అధికారులతో సమావేశమై పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేవెళ్ల ఏసీపీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యాలయం పరిసరాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ బి.కిషన్, ఇన్‌స్పెక్టర్లు భూపాల్ శ్రీధర్, పవన్‌కుమార్‌రెడ్డి, కాంతారెడ్డి, డీఐ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌నాయుడు ఉన్నారు.

మహారాష్ట్రలో గెలుపుపై బీజేపీ సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: దేశం మొత్తం బీజేపీ వైపు చూస్తోందని.. తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో తమదే గెలుపని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎ.అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి గెలుపుపై సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా మొత్తం బీజేపీ, ప్రధాని మోదీవైపే ఉన్నారని మరోసారి మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు నిరూపించాయని అన్నారు. దేశంలో మోదీ పాలన అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా సాగుతోందని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ఇలాంటి ప్రభుత్వమే తమ రాష్ట్రంలోనూ ఉండాలని బీజేపీని ఆదరించి మహారాష్ట్ర ప్రజలు గెలిపించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే నమ్మి మోసపోయిన ప్రజలు బీజేపీ రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్, కృష్ణాగౌడ్, శర్వలింగం, ప్రతాప్‌రెడ్డి, రాములు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



మద్యం నిషేధించిన బోదనంపల్లి గ్రామం

సండే స్పెషల్

మందు ముట్టం

చేయిచేయి కలిపారు



అంతా ఒక్కటిగా కదిలారు | మద్యాన్ని నిషేధించారు | ఆదర్శంగా నిలిచారు

మద్యం.. కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది.. అయినవారి మధ్య చిచ్చు పెడుతోంది.. మత్తులో తమ జీవితాలను నాశనం చేసుకోవడంతోపాటు కుటంబాలను వీధిన పడేస్తున్నారు మందుబాబులు.. ఒంటిని, ఇంటిని గుల్ల చేస్తున్న ఈ మహమ్మారిని రూపుమాపేందుకు 'నిషేధం' ఒక్కటే మార్గమని తీర్మానించాయి పలు గ్రామాలు. ఒక్కరితో మొదలై.. పదిమందిగా కదిలి.. ఊరు ఊరంతా ఏకమై మద్యంపై సమరశంఖం పూరించారు. పచ్చని పల్లెల్లో చిచ్చు రాజేసే మందు వాసన లేకుండా చేశారు. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. అలాంటి పలు పల్లెలపై ప్రత్యేక కథనం..



కిషన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



చౌడమ్మగుట్ట తండాలో మద్యం నిషేధించాలని పంచాయతీ కార్యదర్శికి వినతి (ఫైల్)

షాద్‌నగర్: సరిగ్గా 14 ఏళ్ల క్రితం కేశంపేట మండలం బోదనంపల్లి గ్రామంలో పదుల సంఖ్యలో బెల్టు దుకాణాలు కొనసాగేవి. మద్యం మత్తులో తరచూ వాగ్వాదాలు చోటుచేసుకునేవి. కుటుంబాలకు పెను శాపంగా మారిన ఈ రక్కసిపై స్థానిక మహిళల పోరు షురూ అయింది. గ్రామంలో మద్యం సీసాలు, సారా బాటిళ్లను బయటికి తెచ్చి ధ్వంసం చేసి పోరాటాన్ని కొనసాగించారు. ఫలితంగా ఆ గ్రామంలో మద్య నిషేధం అమల్లోకి వచ్చింది. కొన్నేళ్లుగా ఈ గ్రామంలో బెల్టు షాపులు కానీ, మద్యం తాగడం కానీ కనిపించడం లేదు. మద్యంప్రియులు బయట ప్రాంతాలకు వెళ్లి తాగాల్సిందే. ఇదీ ఇక్కడి నిబంధన. ఇదే స్ఫూర్తితో అల్వాల గ్రామస్తులు ముందడుగు వేశారు. మద్య నిషాధాన్ని అమల్లోకి తెచ్చారు. ఏడేళ్ల పాటు ఈ గ్రామంలో మద్యం నిషేధించినా ప్రస్తుతం అక్కడక్కడా అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక విశ్వనాథ్‌పూర్ గ్రామంలో కూడా కొన్నేళ్లుగా మద్య నిషేధం కొనసాగుతోంది. ఈ గ్రామస్తుల పోరాటం మరిన్ని గ్రామాలకు ప్రేరణగా నిలిచింది.

ఒకే ఒక్కడితో మొదలై..

ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌లో గ్రామానికి చెందిన నడుల్ల శేఖర్ అనే యువకుడితో పోరాటం మొదలైంది. గత సెప్టెంబర్‌లో మద్య నిషేధం చేయాలని గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరహార దీక్షకు దిగాడు. గ్రామ పెద్దలు, మహిళలు రాజకీయాలకు అతీతంగా అతడికి మద్దతు తెలిపారు. బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే, ఎక్సైజ్ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. పంచాయితీ వారు బెల్టు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ఇక నుంచి మద్యం విక్రయిస్తే చెప్పుల దండ వేసి ఊరేగిస్తామని.. మద్యం విక్రయించిన, కొనుగోలు చేసిన వారికి జరిమానా విధిస్తామని ప్రత్యేకంగా గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మద్యం విక్రయిస్తే రూ.50వేల జరిమానా విధిస్తామని, అమ్మేవారిని పట్టిస్తే రూ.10 వేల నజరానా అందజేస్తామని ప్రకటించడంతో బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయాలు నిలిచిపోయాయి. ఇక్కడి పోరాటం మరికొన్ని గ్రామాలకు పాకింది. ఇదే మండలంలోని గంట్లవెళ్లి, చౌడమ్మగుట్ట తండావాసులు సైతం మద్య నిషేధం అమలు చేయాలంటూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

జీవితాలు నాశనం కావొద్దని



గ్రామంలో చాలా మంది మద్యానికి బానిసలవుతున్నారు. మద్యం మత్తులో జీవితాలు నాశనం కావొద్దన్న ఆలోచనతో పోరాటం ప్రారంభించాను. నా పోరాటానికి గ్రామస్తులంతా మద్దతు తెలిపారు. మద్యం విక్రయాలు నిషేధించాలని అధికారులే, నాయకులను కలిశాం. అందరి సహకారంతో బెల్టు దుకాణాలు మూతపడ్డాయి. సంతోషంగా ఉంది.

– శేఖర్, కిషన్‌నగర్, ఫరూఖ్‌నగర్ మండలం

మహిళల పోరాటంతోనే..



గ్రామంలో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తుంటడంతో చాలామంది మద్యానికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గ్రామంలో బెల్టు దుకాణాలు తొలగించాలని మహిళలంతా కలిసి పెద్ద ఎత్తున బయటికి వచ్చారు. ఇలా మొదలైన ఉద్యమంతో గ్రామంలో 14 ఏళ్లుగా మద్య నిషేధం కొనసాగుతోంది.

– ఎదిర కళమ్మ, బొదనంపల్లి, కేశంపేట

హిందూ దేవాలయాలకు భద్రత కరువు



శివలింగం చోరీ జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

- రాష్ట్రంలో మతకల్లోలాలు సృష్టించేందుకు కుట్ర
- సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో మతకల్లోలాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఫరూఖ్‌నగర్ (వివేకానందనగర్)లోని బసవన్న దేవాలయంలో శివలింగం చోరీ నేపథ్యంలో శనివారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో హిందూ దేవాలయాలకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు కుట్ర పూరితంగా దాడులు చేయడం, విగ్రహాలను ధ్వంసం చేయడం చేస్తున్నారని అన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కుట్రలు చేస్తూ వికృతానందం పొందుతున్నారని విమర్శించారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, మతకల్లోలాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఆలయాల్లో సరైన నిఘా ఏర్పాటు చేయకపోవడంతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన వారు ఎవరు, ఈ కుట్ర వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, సుభాష్, శివానందస్వామి, చెట్ల వెంకటేష్, ఆకుల ప్రదీప్, మల్చలం మురళి, ప్యాట అశోక్, కాసోజు శివ, మఠం రుషికేష్, ఎంకనోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- బొంగ్లూర్ ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో తనిఖీ

ఇబ్రహీంపట్నం రూరల్: బతుకులు మారాలంటే చదువే ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధి బొంగ్లూర్‌లోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలోకి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని, నాసిరకమైన భోజనం వడ్డిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హాస్టల్ గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. మూత్రశాలలు పరిశుభ్రంగా లేవని వార్డెన్‌ను ప్రశ్నించారు. నీటి కొరతతో ఇబ్బందులు ఉన్నాయని వార్డెన్ సమాధానం ఇవ్వగా సోమవారంలోపు బోరు వేయించేలా చూడాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సొంత నిధులతో బోరు, దోమ తెరలు ఇప్పిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఇంటర్ దశ ఎంతో కీలకమన్నారు. ఈ దశలో చెడు దారుల్లోకి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని, బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ అమరేందర్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఆర్ఐ కృష్ణ, వార్డెన్ రజిత తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

సమన్వయంతో పనిచేయండి

ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో శనివారం కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా శాఖల పనితీరు, పురోగతి, చేపడుతున్న పనులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆయా శాఖలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, సీఎం వద్దకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు, ఆర్డీఓ అనంతరెడ్డి, డీఆర్డీఓ పీడీ శ్రీలత, జిల్లా పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, మార్కెట్ చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనాధన్ రిచ్!

దేశంలోనే అత్యంత సంపన్న జిల్లా రంగారెడ్డి

- తలసరి ఆదాయం రూ.11.46 లక్షలు
- ఇది దేశ పీసీఐ కంటే 5 రెట్లు అధికం
- రూ.5.39 లక్షలతో హైదరాబాద్ 18వ స్థానం
- ఐటీ, ఫార్మా, రియల్టీ రంగాలతోనే ఈ అభివృద్ధి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: దేశంలోనే అత్యంత సంపన్న జిల్లాగా రంగారెడ్డి అవతరించింది. తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) ప్రకారం దేశంలోని 25 సంపన్న జిల్లాల్లో రంగారెడ్డికి తొలి స్థానం దక్కగా.. 18వ స్థానంలో హైదరాబాద్ నిలిచింది. జాతీయ తలసరి ఆదాయం (పీసీఐ) కంటే రంగారెడ్డి పీసీఐ 5 రెట్లు అధికంగా ఉంది. నేషనల్ పీసీఐ రూ.2.25 లక్షలుగా ఉండగా.. రంగారెడ్డి తలసరి ఆదాయం రూ.11.46 లక్షలు. ఇక, హైదరాబాద్ పీసీఐ రూ.5.39 లక్షలు.

శక్తిమంతమైన వాణిజ్య కేంద్రంగా..

పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో మిళితమై ఉన్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయ, ముడి పదార్థాల ఉత్పత్తులతో పాటు శక్తిమంతమైన వాణిజ్య కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఐటీ, ఫార్మా, తయారీ రంగాల కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దీంతో నివాస, వాణిజ్య సముదాయాల మార్కెట్‌కు డిమాండ్ ఏర్పడింది. సేవలు, ఆదాయం ఉత్పాదకత ఒక నిర్దిష్ట ప్రాంతంలో కేంద్రీకృతమై ఉండటంతో తలసరి ఆదాయ పరంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అంతరం చాలా ఎక్కువ ఉంది. అంతేకాకుండా హైదరాబాద్‌లో పాతబస్తీ, ముషీరాబాద్, అంబర్‌పేట వంటి రద్దీ ప్రాంతాలున్నాయి. దీంతో విశాలమైన, విలాసవంతమైన అవసరాల కోసం రంగారెడ్డి వైపు విస్తరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. తలసరి ఆదాయం పెరుగుదలతో సంక్షేమ చర్యలు, ఉద్యోగ అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన పరంగా ఉపయుక్తమవుతుంది.

దేశంలోని ప్రధాన జిల్లాల తలసరి ఆదాయం

జిల్లా	తలసరి ఆదాయం (రూ.లక్షల్లో)
రంగారెడ్డి	11.46
గుర్గావ్	9.05
బెంగళూరు	8.93
ముంబై	6.57
అహ్మదాబాద్	6.43
గాంధీనగర్	6.03
హైదరాబాద్	5.39
చెన్నై	5.20
ఎన్‌సీటీ ఢిల్లీ	5.01

ఐటీ, రియల్టీలతో వృద్ధి..

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రియల్ ఎస్టేట్ రంగాలు రంగారెడ్డికి మణిహారంగా మారాయి. హైదరాబాద్‌లోని పశ్చిమ ప్రాంతంలో స్థలం కొరత, రద్దీ తదితర కారణాలతో స్థానిక ఐటీ, ఇతర సంస్థలు జిల్లా వైపు విస్తరిస్తున్నాయి. కొన్నేళ్లుగా స్థానిక ప్రభుత్వాలు కూడా డిఫెన్స్, ఫార్మా క్లస్టర్లు, తయారీ కేంద్రాల వంటి కొత్త ప్రాజెక్టులను సైతం ఈ జిల్లా వైపే మళ్లించాయి. దీంతో స్థానికంగా భూములకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. భూ లావాదేవీలు, తలసరి ఆదాయం పెరిగాయి. హైదరాబాద్ కంటే ధనిక జిల్లాగా రంగారెడ్డి అభివృద్ధి చెందింది.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంటైనర్

ముగ్గురికి తీవ్రగాయాలు

- రాయికల్ టోల్ ప్లాజా వద్ద ప్రమాదం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమల్ యాదవ్



ప్రమాదంలో చేయి విరిగిన సెక్యూరిటీ గార్డు రమేశ్

షాద్‌నగర్ రూరల్: టోల్‌ప్లాజాలో లైన్ మారుతున్న బస్సును కంటైనర్ ఢీ కొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శనివారం రాత్రి షాద్‌నగర్ శివారులోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఆత్మకూర్‌కు వెళ్తోంది. టోల్ ప్లాజాలో ఫాస్టాగ్ కార్డు పని చేయకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బంది బస్సును ఇతర లైన్‌లో నుంచి వెళ్లాలని సూచించారు. దీంతో డ్రైవర్ బస్సును వెనక్కి తీసుకుని మరో లైన్‌లోకి వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన కంటైనర్ ఢీ కొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న అమిస్తాన్‌పూర్‌కు చెందిన తిరుమల్ యాదవ్, నారాయణపేట జిల్లా గుండుమాల్‌కు చెందిన శంకర్‌నాయక్‌తో పాటు డ్రైవర్ నాగరాజు, కండక్టర్ సాయిబాబు, టోల్‌ప్లాజా సెక్యూరిటీ గార్డులకు గాయాలయ్యాయి. వీరిలో తిరుమల్, కండక్టర్ సాయిబాబ, రమేశ్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయాలైన వారిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ఆలయాలపై దాడులు అరికట్టండి

- శివలింగం చోరీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి
- వీహెచ్‌పీ రాష్ట్ర నాయకుడు సుభాష్
- హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



రోడ్డుపై బైఠాయించిన హిందూ సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆలయంలోని శివలింగాన్ని చోరీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు సుభాష్ డిమాండ్ చేశారు. బసవన్న దేవాలయంలో శివలింగం చోరీ ఘటనపై శనివారం భజరంగ్‌దళ్ పిలుపు మేరకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో హిందూ వాహిని, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఫరూఖ్‌నగర్ నుంచి పట్టణ ముఖ్య కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టిన అనంతరం రోడ్డుపై బైఠాయించారు. నిరసనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించే క్రమంలో హిందూ సంఘాల నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాలపై దాడులు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శివలింగం చోరీ జరిగి రెండు రోజులు గడుస్తున్నా పోలీసులు నిందితులను గుర్తించ లేక పోయారని అన్నారు.అనంతరం కొత్తకోట ధర్మశాస్త్ర పీఠాధిపతి శివానంద స్వామి మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అన్నారు. అనంతరం వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. ఆలయాలపై దాడులకు పాల్పడిన నిందితులను గుర్తించకుండా హిందువులపైనే ఆంక్షలను పెట్టడం సరికాదన్నారు. హిందూ దేవాలయాలను కాపాడుకునేందుకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని చేపడితే పోలీసులు అడ్డుకోవడం ఎంతరవకు సమంజసమని ప్రశ్నించారు. శివలింగాన్ని ఎత్తుకెళ్లిన దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రుషికేష్, శివ, అశోక్, వంశీ, మురళి, రమేష్, వంశీ, విజయ్, వినయ్, శివానంద్, శివశంకర్, రాంచందర్, మనోహర్, అనిల్, నర్సింహ, గిరి, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

కొందుర్గు: దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ హామీ ఇచ్చారు. శనివారం కార్తీక మాసం సందర్భంగా మండల పరిధిలోని సంజీవపురం చింతల్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకేఈ అరుణ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి బావనతో మెలగాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు అందె బాబయ్య, భూపాలచారి, శివారెడ్డి, ప్రభులింగం, లక్ష్మీకాంత్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సుధాకర్ రావు, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యం

టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ఐక్యత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొంది పలువురు యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ఎంతో సంతోషానిస్తోందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ఐదురోజులుగా నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. క్యాంపులో కంటి ఆపరేషన్లు నిర్వహించుకున్న వారితో ముచ్చటించారు. అంతకుముందు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల కోచింగ్ క్యాంపులో శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పది మందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం మరోసారి క్యాంపు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా శంకర నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, శేఖర్, ఖాదర్, రాజశేఖర్, మైసయ్య, కొండల్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

చిన్నబోయిన వైకల్యం

దివ్యాంగుడికి డాక్టరేట్



జానయ్యకు డాక్టరేట్ పట్టా అందజేస్తున్న సాహితీవేత్తలు, అధికారులు

మొయినాబాద్: వైకల్యం శరీరానికే కానీ మేదస్సుకు లేదని నిరూపించాడు ఓ దివ్యాంగుడు. ప్రైవేటు పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తూ జానపదాలు, కవితలు రాస్తూ, పాటలు పాడుతూ కవిగా, గాయకుడిగా ఎదిగి డాక్టరేట్ అందుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. దివ్యాంగుడైన ఆరింపుల జానయ్య పెద్దమంగళారం రెవెన్యూలోని మమత ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. ఇతని కళలను గుర్తించిన హైదరాబాద్ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ అతనికి జానపద కవి, గాయకుడిగా డాక్టరేట్ ప్రదానం చేసింది. నగరంలోని అల్లెడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు, మా అసోసియేషన్ చైర్మన్, ప్రభుత్వ అధికారుల చేతులమీదుగా డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టరేట్ రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ప్రసాద్ మృతదేహం

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ట ప్రసాద్(45) విద్యుత్ సరఫరా కావడం లేదని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు వేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, కుమారుడు ఉన్నారు. ఈ విషయమై ఇంకా ఫిర్యాదు అందలేదని జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు తెలిపారు.

కణతకు గన్‌పెట్టి.. రూ.కోటి డిమాండ్

- రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసిన దుండగులు
- ఖాళీ పేపర్లపై సంతకాలు, వేలిముద్రల సేకరణ
- కేసు నమోదు చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: తమ ప్లాట్లను కొనాలని పిలిచి, ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేయడంతో పాటు కణతకు గన్‌పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు రూ.కోటి రూపాయలు డిమాండ్ చేశారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన రచ్చ నారాయణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి పది రోజుల క్రితం.. కారు ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేసుకోవాలంటూ ఓ మహిళ నుంచి ఫోన్ వచ్చింది. అనంతరం ఇదే నంబర్ నుంచి ఫోన్ చేసిన మరో వ్యక్తి మీరు రియల్ ఎస్టేట్ వ్యాపారి కదా.. బొంగ్లూర్‌లో మాకు ప్లాట్లు ఉన్నాయి కొంటారా అని అడిగారు. వారం రోజులుగా తరచూ ఫోన్ చేస్తుండటంతో నిజమేనని నమ్మిన వ్యాపారి ఈనెల 21న మధ్యాహ్నం ఒంటిగంటకు డ్రైవర్ ముసీబ్‌ఖాన్‌తో కలిసి మెట్రోసిటీ వెంచర్‌కు వెళ్లాడు. ఫోన్ చేసిన వ్యక్తులు అప్పటికే అక్కడ వేచి ఉన్నారు. నారాయణ కారు దిగగానే అకస్మాత్తుగా నలుగురు వ్యక్తులు వచ్చి, డ్రైవర్‌ను దింపేసి, ముఖానికి మాస్క్, చేతులకు హ్యాండ్ కఫ్స్ వేసి తన కారులోనే నారాయణను తీసుకెళ్లారు. 45 నిమిషాల తర్వాత ఓ గదిలోకి తీసుకెళ్లి కట్లు విప్పారు. ఈ సమయంలో పోలీసు యూనిఫాం ధరించి ఉన్న ఓ వ్యక్తి నారాయణ కణతపై తుపాకీ పెట్టి, కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన వద్ద డబ్బు లేదని చెప్పడంతో వారి వద్ద ఉన్న పది పేపర్లపై అతని సంతకం, వేలి ముద్రలు తీసుకున్నారు. తర్వాత కారులో ఎక్కించుకుని సాయంత్రం నాలుగు గంటలకు చందూరులోని ఓ వెంచర్లో వదిలేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి



కౌశిక్ రాఘవ(ఫైల్)

మియాపూర్: మియాపూర్ పరిధి మాతృశ్రీనగర్ కాలనీ లోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బాధితులు, పోలీసులు తెల్పిన మేరకు..షాద్‌నగర్‌కు చెందిన గౌరిశెట్టి శ్రీనివాస్, మాధవి దంపతుల కుమారుడు కౌశిక్ రాఘవ (17) ఈ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్ చదువుతూ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే కౌశిక్ శుక్రవారం రాత్రి 10 గంటలకు స్టడీ అవర్ పూర్తిచేసుకుని స్నేహితులతో కలిసి గదికి వెళ్లాడు. అక్కడ 11 గంటల వరకు స్నేహితులతో కలిసి గేమ్స్ ఆడుకున్నారు. ఆ తర్వాత నిద్రించేందుకు ఎవరి గదికి వారు వెళ్లిపోయారు. 10వ తరగతి స్నేహితులను మిస్ అవుతున్నానని, వారు ఇప్పుడు తనతో మాట్లాడడం లేదని స్నేహితుడు ఫరూఖ్‌తో చెబుతూ బాధపడ్డాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 5:15 గంటల ప్రాంతంలో ప్రతిరోజు మాదిరిగానే కళాశాల వార్డెన్ విద్యార్థులను నిద్రలేపుతుండగా 238 నంబర్ గదిలో రాఘవ బెడ్‌పై మెడకు తాడుతో పడి ఉన్నాడు. వెంటనే కళాశాల సిబ్బంది దగ్గర్లో ఉన్న ల్యాండ్ మార్క్ ఆసుపత్రికి ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లారు. అక్కడి డాక్టర్లు పరిశీలించి విద్యార్థి మృతి చెందాడని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి గాంధీ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. కళాశాల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే కౌశిక్ మృతి చెందాడని, కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, మాకు న్యాయం చేయాలని విద్యార్థి తల్లి మాధవి మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌశిక్ ఆత్మహత్య చేసుకోలేదన్నారు. మృతిపై అనుమానం ఉందని పేర్కొన్నారు. కాగా కళాశాల ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడని ఆరోపించారు.

ఖరీదైన విదేశీ గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో లభించే ఖరీదైన గంజాయిని నగరంలో విక్రయిస్తున్న నిందితులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నగరానికి చెందిన మోహిత్, మరో ఇద్దరితో కలిసి బెంగళూరు నుంచి..విదేశాల్లోను, హిందూకుష్ పర్వత శ్రేణుల్లోనూ లభించే 'ఓజీ కుష్'అనే రకానికి చెందిన ఖరీదైన గంజాయిని నగరానికి తెప్పించి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి 57 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.75 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు నిందితులు చిరుద్యోగులు. వీరిని మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు వీరిపై గతంలో కూడ పలు కేసులు ఉన్నాయని ఎస్టీఎఫ్ పోలీసులు తెలిపారు.